క్లుప్తంగా

పటిష్టంగా జీఈఆర్ సర్వే

నంద్యాల(సిటీ): పట్టణంలో జీఈఆర్ (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో) సర్వేను పటిష్టంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం 7వ వార్డు ఫరూఖ్‌నగర్, 20వ వార్డు నివర్తినగర్, 21వ వార్డు నూనెపల్లె వార్డుల్లో జీఈఆర్ సర్వేను సచివాలయ డేటా ఎడ్యుకేషన్ సెక్రటరీ, వలంటీర్ల సహకారంతో నిర్వహించారు.

విజయవంతం చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 7న నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు రఘురామ్మూర్తి, శివబాలకృష్ణ, అబ్బాస్, వేదావతి, శ్రీనివాసులు పాల్గొన్నారు. అలాగే.. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రఘురామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి సుంకయ్య కోరారు. ఈనెల 9వ తేదీన కర్నూలులో జరిగే సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రిజర్వేషన్లను కాపాడుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): బలహీన వర్గాల కోసం అంబేడ్కర్ రాజ్యాంగంలో రూపొందించిన రిజర్వేషన్లను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దళిత హక్కుల పోరాట సమితి నంద్యాల జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య, జిల్లా కార్యదర్శి కొమ్ముప్రభాకర్ అన్నారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలోని స్వామిరెడ్డి భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈనెల 6వ తేదీన అంబేడ్కర్ 67వ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని కోరారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): కర్నూలులో ఈనెల 3న జరిగిన మేయర్ కప్ దక్షిణాది రాష్ట్రాల కరాటే పోటీల్లో తమ విద్యార్థులు పతకాలు సాధించారని బాలా అకాడమీ ప్రిన్సిపాల్ మాధవీలత, రవీంద్రనాథ్ సోమవారం తెలిపారు. వారు మాట్లాడుతూ.. 9 విభాగాల్లో బంగారు 13, సిల్వర్ 9, కాంస్య 14 పతకాలు సాధించి టీం చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నట్లు వివరించారు. శిక్షకులు మహేష్‌యాదవ్, రామకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, సురేష్‌ను అభినందించారు.

పాలక మండలి ప్రమాణస్వీకారం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక గాంధీచౌక్‌లోని శ్రీచంద్రశేఖర కాళికాంబ దేవస్థానం పాలక మండలి సభ్యుల ప్రమాణస్వీకారం టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేవస్థానం చైర్మన్‌గా ఆరవేటి శ్రీనివాసులు, సభ్యులుగా మోదాల విజయ్‌కుమార్, ప్రతాప్, వరలక్ష్మి, లింగమ్మ, నాగమణిబాయి, లక్ష్మి, ఎక్స్ అఫీషియో మెంబరుగా అలయ ప్రధాన అర్చకుడు వెంకటరమణాచారి ప్రమాణస్వీకారం చేశారు. అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి, కిరణ్, శ్రీకాళీమాత సేవా సమాజ్ సభ్యులు నరసింహ, తిమ్మయ్య, రాఘవేంద్రాచారి, హరి పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణం నిలిపి వేయాలి

నంద్యాల(న్యూటౌన్): డోన్ మండలం వెంకటనాయునిపల్లె పరిధిలో రైల్వే గేటు నెం.164/ఈ అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణాన్ని నిలిపివేసి యథావిధిగా కొనసాగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, బాబాఫక్రుద్దీన్ జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రజాభిప్రాయం సేకరించకుండా, గ్రామ సభలు నిర్వహించకుండా పనులు ప్రారంభించడం దారుణమన్నారు. బ్రిడ్జి నిర్మాణం నిలిపి వేయాలని 15గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వ్యతిరేకిస్తున్నారని చెప్పారు.

శిరోముండనం వాస్తవం..

నలందా జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శిరోముండనం చేయించడం, విద్యార్థి చేయి విరగొట్టిన విషయం వాస్తవమని, వెంటనే చర్యలు తీసుకోవాలని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘాల నాయకులు చెవిలో పూలు పెట్టుకొని వినూత్న నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ చిన్న సమస్య జరిగిందని, తల్లిదండ్రులు చెప్పినట్లే ట్రిమ్మింగ్ చేయించామని యాజమాన్యం చెప్పడం దారుణమన్నారు. జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ధనుంజయుడు, రాజునాయుడు, రఫీ, లక్ష్మణ్, రాంబాబు, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

రిపోర్టు ఇప్పించండి సార్..

దొర్నిపాడు: తాను సాగుచేసిన మిరప పంటపై గడ్డిమందు పిచికారీ చేయడంతో పంటంతా ఎండిపోవడంతో ఫిర్యాదు మేరకు గుంటూరు నుంచి హార్టికల్చర్ శాస్త్రవేత్త వెంకటరమణ స్థానిక అధికారులతో కలిసి పంటను పరిశీలించి మిరప మొక్కలు, మట్టిని గత నెల 21న ల్యాబ్‌కు తీసుకెళ్లారని.. అయితే నేటి వరకు ఫలితం వెల్లడించలేదని చాకరాజువేముల గ్రామానికి చెందిన రామదాసు తెలిపాడు. రిపోర్టు కోసం పంటను అలానే వదిలేశానని, 12 ఎకరాలకు రూ.5లక్షలు కౌలు చెల్లించానని, మరో పంట వేసుకోవడానికి రిపోర్టు కోసం ఎదురు చూస్తున్నాని చెప్పాడు. పంట సాగుకు ఇప్పటికే రూ.12లక్షల వరకు పెట్టుబడి పెట్టానని, తనకు న్యాయం చేయాలని సోమవారం నంద్యాలలో జరిగిన స్పందనలో అధికారులను కలిసి వినతి పత్రం అందజేశాడు.




కార్తీక దీపాల నడుమ ప్రత్యేక అలంకరణలో ఉభయ దేవేరులతో కొలువైన ప్రహ్లాదవరదుడు, ఉత్సవానికి ఊరేగింపుగా వస్తున్న ఉత్సవమూర్తులు, దొర్నిపాడు వద్ద భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో అహోబిలేశుడి వనభోజన మహోత్సవం

ఆళ్లగడ్డ: అహోబిలంలో వెలసిన శ్రీ లక్ష్మీనృసింహ స్వామి వనభోజన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్తీక మాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లను వనభోజన కార్యక్రమానికి తోడ్కొనిపోయి ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సోమవారం దిగువ అహోబిలంలో కొలువైన మూలమూర్తులు శ్రీ ప్రహ్లాదవరదస్వామి, అమృతవల్లీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో కొలువుంచి గ్రామ శివారులోని లక్ష్మీవనంలోకి ఊరేగింపుగా తోడ్కొని వెళ్లారు. అక్కడ ఉత్సవమూర్తులకు వేద పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య నవకళశస్థాపన, పంచామృతాభిషేకం, తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిపించి ప్రత్యేకంగా అలంకరించి మండపంలో కొలువుంచారు. అనంతరం భక్తులు వనభోజనం చేశారు. రాత్రి పూల పల్లకీలో ఉత్సవ మూర్తులను ఆశీనులుగావించి మాడ వీధుల్లో ఊరేగించారు.

మండల కేంద్రం శివారులో వెలసిన కాశిరెడ్డినాయన ఆశ్రమం వద్ద కార్తీకమాసం మూడోవ సోమవారం సందర్భంగా బలిజ సంఘం ఆధ్వర్యంలో వన భోజనాలను ఏర్పాటు చేశారు. అహోబిలం బలిజసత్రం అధ్యక్షుడు శెట్టి విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వామివారికి పూజల అనంతరం భోజనాలు వడ్డించారు.


అహోబిలంలో వనభోజనం కార్యక్రమానికి హాజరైన భక్తులు

అన్నదానం

నంద్యాల(వ్యవసాయం): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో అన్నదానం చేశారు. ముందుగా ఆయన చిత్రపటానికి లయన్స్‌క్లబ్ సభ్యులు పెసల శ్రీకాంత్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రోగులు, వారి కుటుంబ సభ్యులకు అన్నదానం చేపట్టారు.

వినతులను సత్వరమే పరిష్కరించండి


వినతులు స్వీకరిస్తున్న డిప్యూటీ కలెక్టర్

నంద్యాల: జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన వినతులను కాలపరిమితిలోపు పరిష్కరించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వెంకట శివ, కామేశ్వరరావు సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో 180 వినతులు అందాయని చెప్పారు.

పేదల ఇళ్లల్లో సంక్షేమ వెలుగులు


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): పేదల ఇళ్లల్లో సంక్షేమ వెలుగులు నింపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 22వ వార్డు క్రాంతి నగర్‌లో కౌన్సిలర్ నేలటూరి చంద్రశేఖర్‌తో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాలు ఎంత మేర కుటుంబాలకు ఉపయోగపడుతున్నాయో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ వెలుగులు మీ జీవితాల్లో కొనసాగాలంటే సంక్షేమాభివృద్ధి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మరో మారు పట్టం కట్టాలని కోరారు. వార్డులో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఆధారంగా పథకాలను అందజేస్తూ ప్రజల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో మద్దతివ్వాలన్నారు. టీడీపీ నేతల మాయ మాటలు వింటే పెత్తందారి వ్యవస్థ రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తుందని చెప్పారు. ఎవరి సిఫారసులు లేకుండా నేరుగా పథకాలు అందజేస్తుంటే టీడీపీ నాయకులు దుష్ప్రచారానికి తెరలేపారన్నారు. ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, తాలుకా సీఐ దస్తగిరి బాబు, నాయకులు రామసుబ్బారెడ్డి, మణిమోహన్‌రెడ్డి, రామిరెడ్డి, రామచంద్రుడు, శేషిరెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మిప్రసన్న, సుభాన్ పాల్గొన్నారు.

కిటకిటలాడిన శివాలయాలు

ఆళ్లగడ్డ: శివ నామస్మరణతో నియోజకవర్గంలోని శైవ క్షేత్రాలు, శివాలయాలు హోరెత్తాయి. కార్తీక మాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని శివాలయాలు భక్తులతో నిండిపోయాయి. ఆలయాల్లోని మూలవిరాట్టును ప్రత్యేకంగా అలంకరించారు. కార్తీక దీక్ష చేపట్టిన మహిళలు తెల్లవారుజామునే పుణ్యస్నానాలు ఆచరించి శివాలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. రాత్రి మహిళలు, యువతులు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణ శివారులోని కాచింతల క్షేత్రం, పట్టణంలోని అమృతలింగేశ్వరస్వామి ఆలయాలను భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని జమ్మి, ఉసిరిచెట్లకు పూజలు చేసి ప్రమిదలు వెలిగించారు

రుద్రవరం: మండలకేంద్రంతో పాటు నర్సాపురం, ఆలమూరు, ఎల్లావత్తుల, కోటకొండ, పేరూరు, ఎర్రగుడిదిన్నె, నల్లమల ఆటవీ ప్రాంతంలో వెలసిన ఉల్లెడ తదితర శివాలయాలు సోమవారం భక్తులతో కిక్కిరిశాయి. కార్తీకమాసం మూడవ సోమవారం సందర్భంగా భక్తులు తెల్లవారు జామునుంచే ఆయా ఆలయాలు చేరుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. దీపాలు వెలిగించి శివ నామస్మరణం చేశారు.

నంద్యాల(వ్యవసాయం): కార్తీక మాసం మూడవ సోమవారం పురస్కరించుకొని పట్టణంలోని శైవాలయాల్లో తెల్లవారుజాము నుంచే భక్తులు అభిషేకాలు, పంచామృతాభిషేకాలు, మహాన్యాస పూర్వక ఏక రుద్రాభిషేకాలు నిర్వహించారు. పలు దేవాలయాల్లో భక్తులు కేదారేశ్వర నోములు, గౌరీనోములు నోముకున్నారు. శైవ క్షేత్రాల్లో సాయంత్రం ఆకాశ దీపాన్ని వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక మాసంలో సాయంత్రం వెలిగించే దీపం విశేష శుభ ఫలితాలను ఇస్తాయని మహిళలు దేవాలయాల్లో కార్తీక దీపాలను వెలిగించి ఉపవాస దీక్షలు విరమించారు. పట్టణంలోని సంజీవనగర్ రామాలయం, స్పటిక లింగేశ్వర ఆలయం, టెక్కె నాగలింగేశ్వర ఆలయం, కాళికాంబ దేవస్థానం, నాగనందీశ్వర స్వామి దేవస్థానం, సోమనందీశ్వర దేవస్థానం, ప్రథమనందీశ్వర, బ్రహ్మనందీశ్వర ఆలయం, అమ్మవారి శాలలోని శ్రీనగరేశ్వర స్వామికి అభిషేకాలు, బిల్వార్చన, సామూహిక కుంకుమార్చన జరిపించారు.


ప్రథమనందిలో జలాభిషేకం చేస్తున్న భక్తులు

విద్యార్థులు బడిలోనే ఉండాలి


తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్ఈ వెంకటరమణయ్య

దొర్నిపాడు: తల్లిదండ్రులు బాధ్యతగా తీసుకొని పిల్లలను బడికి పంపాలని జీఈఆర్ (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో) సర్వే సందర్భంగా మండల ప్రత్యేక అధికారి, తెలుగుగంగ ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణయ్య సూచించారు. సోమవారం చాకరాజువేముల, దొర్నిపాడు సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న సర్వేను తనిఖీ చేశారు. పిల్లలను తప్పనిసరిగా బడికి పంపాలని సూచించారు. ఎంపీడీఓ సుబ్బారెడ్డి, ఎంఈఓ రామచంద్రయ్య, సీఆర్‌పీలు శివకుమార్, ఓబులేసు పాల్గొన్నారు.

చాగలమర్రి: విద్యార్థులు బడిలోనే ఉండాలని పంచాయితీరాజ్ ఈఈ రామ్మోహన్ అన్నారు. సోమవారం మండలంలోని డి.వనిపెంట, డి.కొత్తపల్లె, చెంచుగూడెం, గొడిగనూరు, చాగలమర్రిలోని చెంచుగూడెం గ్రామాల్లో పర్యటించి మధ్యలో బడి మానేసిన 5 – 18 సవంత్సరాలలోపు విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో 226 మంది మధ్యలో చదువు మానేసినట్లు అధికారులు గుర్తించారని వారిలో ఇప్పటి వరకు 90 మందిని విద్యాలయాలకు పంపారన్నారు. మిగిలిన 136 మందిని విద్యాలయాలకు పంపేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వంద శాతం జీఈఆర్ సాధించేందుకు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఎంఈఓ న్యామతుల్లా, ఏఈలు జయన్న, కొండారెడ్డి, కార్యదర్శి రాజశేఖర్ ఉన్నారు.

డ్రాపవుట్స్ నేడు అవగాహన

నంద్యాల(న్యూటౌన్): డ్రాపవుట్స్‌ను గుర్తించి విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు విద్యార్థి, వలంటీర్ల సంఘాలతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశామని డీఈఓ సుధాకర్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని విద్యార్థి సంఘాలు, వలంటీర్ల సంఘాలు కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సమావేశానికి హాజరుకావాలని కోరారు.

డ్రాపవుట్స్‌ను గుర్తించి సమాచారమివ్వండి


ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న కలెక్టర్

నంద్యాల: గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వే వంద శాతం పూర్తై విద్యాసంస్థల్లో చేరిన విద్యార్థుల డ్రాపవుట్స్‌ను గుర్తించి సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 5–18 సంవత్సరాలలోపు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించామని, అయినప్పటికీ డ్రాపవుట్స్‌ను గుర్తించి సంబంధిత సమాచారాన్ని అధికారులకు చేరవేస్తే తిరిగి పాఠశాలలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.

ఓటరు నమోదుకు ధ్రువ ప్రతాలు తప్పనిసరి

నంద్యాల(అర్బన్): ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం ద్వారా స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సంబధిత డాక్యుమెంట్లను ఫైల్ చేసుకున్న తర్వాతనే ఓటర్ల జాబితాలో పొందుపరచాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శ్యామూన్ బీఎల్‌ఓలను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని నంద్యాల తహసీల్దార్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ డెత్ ఓటర్లకు సంబంధించి ధ్రువపత్రాలు సమర్పించని పక్షంలో పంచనామా నిర్వహించి సంబంధిత పత్రాలు ఫైల్ చేసుకుని తొలగించాలని చెప్పారు. బూత్ స్థాయి అధికారులు తప్పనిసరిగా బీఎల్‌ఓల రిజిస్టర్లు నిర్వహిస్తూ ప్రొసీజర్ ప్రకారం ఫాలో కావాలన్నారు. జాబితాలో తప్పులు దొర్లితే బీఎల్‌ఓలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు.

టీడీపీ మాయ మాటలు నమ్మొద్దు


బోయలకుంట్లలో పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి

శిరివెళ్ల: అధికారం కోసం టీడీపీ ఉత్తుత్తి హామీలతో మాయ మాటలు చెబుతోందని, వారి వలలో చిక్కుకొని మోసపోవద్దని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి అన్నారు. సోమవారం బోయలకుంట్లలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ అధికారమే లక్ష్యంగా చంద్రబాబు నాయుడు ప్రతి ఎన్నికలకు ముందు బూటకపు హామీలతో రావడం రివాజుగా మారిందన్నారు. తీరా గెలిచిన తరువాత హామీలను తుంగలో తొక్కడం మనకు అనుభవమేనని చెప్పారు. ఎంపీపీ నాయక్ వసీం, జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ బేగం, సర్పంచు జింకల నాగన్న, కో- ఆప్షన్ మెంబర్ జబ్బార్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి, మహదేవపురం సర్పంచు పెద్ది రమణయ్య, ఏంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ షేక్ మొయిద్దీన్ పాల్గొన్నారు.

ఆకతాయికి జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): ఆకతాయికి జైలు శిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి ఆదేశించారని సోమవారం పోలీసు సిబ్బంది తెలిపారు. వివరాలు.. శిరివెళ్ల మండలం వనికినిదిన్నె గ్రామానికి చెందిన తోకల ప్రసాద్ అనే వ్యక్తి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోడ్డుపై వెళ్లే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, దూషిస్తుండటంతో స్థానికులు టూ టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా నాలుగు రోజులు శిక్షను విధించారని చెప్పారు.

తుపాను ప్రభావంతో వర్షం


అప్పనపల్లెలో ధాన్యంపై పట్టలు కప్పుకుంటున్న రైతులు

రుద్రవరం: మండలంలో మిచాంగ్ తుపాన్ ప్రభావంతో ఓ మోస్తారుగా వర్షం కురుస్తోంది. ప్రస్తుతం వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే తుపాను కారణంగా రైతుల్లో ఆందోళన నెలకొంది. అలాగే రబీకింద రైతులు మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేసిన జొన్న, మొక్కజొన్న, మినుము పంటలకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగ పడుతుందని రైతులు పేర్కొంటున్నారు.

బావిలో పడిన వరికోత మిషన్

శిరివెళ్ల: యర్రగుంట్ల– పేరూరు మధ్యనున్న ఓ బావిలో వరి కోత మిషన్ పడిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..కోతలు ముగించుకొని వస్తుండగా.. రోడ్డుపక్కనున్న 15 అడుగుల లోతులోనున్న బావిలోకి ఒరిగిపోగా హెల్పర్, డ్రైవర్ కిందకు దూకారు. అయితే హెల్పర్ జాడ కనిపించలేదు. సీఐ వంశీధర్, పోలీస్‌లు ప్రమాద స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కాగా..హెల్పర్ రమణయ్యది వనికిదినిదిన్నె గ్రామం. విషయం తెల్సిన వెంటనే బంధువులు, గ్రామస్తులు ఆందోళనతో బావి వద్దకు చేరుకున్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న మహేశ్వరరెడ్డి

నంద్యాల(అర్బన్): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వర రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని పోలూరు గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీలకు వెళ్లి గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించారు. ఎంపీడీఓ సుగుణశ్రీ, సర్పంచ్ ప్రతాప్, ఏఓ ప్రసాదరావు, డాక్టర్ షహలామ్ పాల్గొన్నారు.


ఎర్రగుడిదిన్నెలో మాట్లాడుతున్న గంగుల మనోహర్ రెడ్డి


పుసులూరులో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం


మహదేవపురంలో మహిళకు పథకాల లబ్ధిని వివరిస్తున్న దృశ్యం

జగన్‌తోనే అభివృద్ధి సాధ్యం

రుద్రవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని పుట్టాలమ్మ క్షేత్రం చైర్మన్ గంగుల మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎర్రగుడిదిన్నెలో సోమవారం ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి , నోడల్ అధికారులతో కలిసి పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు రాబోయే రోజుల్లో జగనన్నకు అండగా నిలుద్దామని పిలుపునిచ్చారు. అనంతరం సంక్షేమాభివృద్ధిని వివరించే ఫ్లెక్సీని గ్రామం సచివాలయంలో ఆవిష్కరించారు. ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ పుల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రసాదరెడ్డి, సచివాలయాల కన్వీనర్ పాణ్యం నాగేష్, నాయకులు కృష్ణారెడ్డి, సుదర్శన్ రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, శీలయ్య, దేవగుడి జాకీర్ న్నారు.

నంద్యాల(అర్బన్): మండలంలోని పుసులూరు గ్రామంలో రూ.19కోట్లతో సంక్షేమాభివృద్ధి జరిగిందని సర్పంచ్ రామసుబ్బయ్య తెలిపారు. సోమవారం పల్లెకు పోదాంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిస్ప్లే బోర్డును ఈఓఆర్డీ మహీధర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు.


పెద్దవంగలిలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించిన దృశ్యం

శిరివెళ్ల: రానున్న ఎన్నికల్లో జగనన్నకు మద్దతుగా నిలుద్దామని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి కోరారు. సోమవారం మహదేవపురంలో పల్లెకు పోదాం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ ప్రధాన కూడలిలో పార్టీ జెండాను ఆవిష్కరించి, ఇంటింటికీ వెళ్లి పథకాల గురించి వివరించి, పాలన తీరుపై వివరాలు సేకరించారు. అంతకు ముందు సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు, బ్రోచర్లను ఆవిష్కరించారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గ్రామంలో సంక్షేమాభివృద్ధికి ప్రభుత్వం రూ.17.50 కోట్లను ఖర్చు చేసిందన్నారు. సర్పంచు పెద్ది రమణయ్య, మార్కెట్ యార్డు వైఎస్ చైర్మన్ నరహరి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, గ్రామ నాయకులు జయలక్షమ్మ, వెంకటస్వామి, సర్వ నరసింహస్వామి ఆలయ చైర్మన్ రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.

చాగలమర్రి: మండలంలోని పెద్దవంగలి గ్రామ సచివాలయానికి రూ.13.22 కోట్లు సంక్షేమాభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిందని సర్పంచ్ బంగారు షరీఫ్ అన్నారు. సోమవారం సచివాలయంలో ఎంపీడీఓ మహబూబ్‌దౌలా ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా డిస్ప్లే బోర్డు ఆవిష్కరించారు. ప్రధాన కూడలి వద్ద పార్టీ జెండా ఎగురవేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కుమార్‌రెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ యర్రం పుల్లయ్య, మాజీ మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ గౌస్‌పీరా, మాజీ ఉప సర్పంచ్ జబ్బార్ పాల్గొన్నారు.

నేడు 'వికసిత్ భారత్'

నంద్యాల(అర్బన్): మండలంలోని మునగాల, రాయమాల్పురం గ్రామాల్లో మంగళవారం వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. అలాగే 6న పులిమద్ది,చాపిరేవుల,7న పాండురంగాపురం, పుసులూరు,8న బ్రాహ్మణపల్లె, మిట్నాల, 9న గుంతనాల, కానాల, 10న అయ్యలూరు, చాబోలు, 11న పెద్దకొట్టాల, బిల్లలాపురం, 12న భీమవరం, కొత్తపల్లె గ్రామాల్లో కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.